ఆహ్వానం..

కేపీహెచ్‌బీ కాలనీ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు.. కేపీహెచ్బీ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు జనగాం సురేశ్ రెడ్డి తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 16న కీసరలో జరిగే జనగాం వంశీకృష్ణారెడ్డి, సౌజన్య వివాహానికి హాజరై.. దంపతులను ఆశీర్వదించాలని కోరారు. అలాగే రాష్ట్ర బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను ఆయన అందజేశారు.

జలమండలి గేటుకు తాళం వేసిన కార్పొరేటర్

మూసాపేట : డివిజన్ పరిధిలోని జనతా నగర్ జలమండలి కార్యాలయానికి బీజేపీ కార్యకర్తలతో కలిసి కార్పొరేటర్ మహేందర్ మంగళవారం గేటుకు తాళం వేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. జనతానగర్‌లో బస్తీ వాసుల నీటి సమస్యలు తీర్చేందుకు పరిష్కారం ఆలోచించకుండా జలమండలి అధికారులు గెజిటెడ్ కమ్యూనిటీలకు ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారని, డివిజన్ పరిధిలోని బస్తీలు, కాలనీల్లో నీటి సమస్య తీరేంతవరకు నీటిని పంపించరాదని జలమండలి కార్యాలయం గేటుకు తాళం వేసినట్టు తెలిపారు. ఆయన వెంట డివిజన్ అధ్యక్షుడు ఎర్ర స్వామి, ప్రధాన కార్యదర్శి రవి గౌడ్, సీనియర్ నాయకులు మల్లేశ్‌గౌడ్, అబ్బాస్, మహిళా మోర్చా డివిజన్ అధ్యక్షురాలు జానకి, రాజేశ్వరి, బాలామణి పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలి



కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు



కూకట్‌పల్లి లోని మల్లికార్జున భ్రమరాంబ స్వామి కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 11: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు చూడాలని, ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఫతేనగర్ డివిజన్ చెందిన జై కల్పన (రామనాథ్)కు రూ. 1.10 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మల్లికార్జున భ్రమరాంబ కల్యాణం

కూకట్‌పల్లిలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మంగళవారం జరిగిన కల్యాణ వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొని పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పురాతన ఆలయాలను అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. ఇప్పటికే పలు ఆలయాలను పునరుద్ధరించడం జరిగిందని... భవిష్యత్‌లో అన్నింటిని బాగు చేసేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఆధ్యాత్మిక వాతావరణం లో ప్రశాంతంగా పూజలు

పూజలు చేసిన ఎమ్మెల్యే కృష్ణారావు

చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా చెత్తవేస్తే చర్యలు తప్పవు

టీ స్టాల్ నిర్వాహకుడికి జరిమానా విధిస్తున్న కొంపల్లి కమిషనర్ కృష్ణారెడ్డి

కుత్బుల్లాపూర్, మార్చి 11: విచ్చలవిడిగా జనవాసాల మధ్య చెత్తను వేస్తే చర్యలు తప్పవని కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కొంపల్లి మున్సిపల్ కమిషనర్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ తనిఖీలో టీ దుకాణదారులు తమ దుకాణాల బయట చెత్త వేయడం గమనించారు. దీని ఫలితంగా ప్రజలకు అసౌకర్యం కలుగుతోందని, పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించి పరిశుభ్రత నిబంధనలను ఉల్లంఘించిన పలువురు టీ దుకాణదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు, దుకాణాదారులు, వ్యాపారస్తులు పారిశుధ్య నియమాలను పాటించి పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సంబంధిత అధికారులు, సిబ్బంది చెత్త తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యాపారస్తులు ప్రతి ఒక్కరూ తమ దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలన్నారు. జనావాసాలల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించ వద్దని అన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

ఈఎస్ఐ కార్డులను అందజేస్తున్న ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ నర్సింహయాదవ్

బాలానగర్ : నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఓల్డ్ బోయిన్పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో ఆయనతో పాటు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు జగదీశ్, రాష్ట్ర అధ్యక్షుడు చుక్క నరసింహులు, సీనియర్ నాయకులు రమేశ్ హాజరయ్యారు. ఈఎస్ఐ కార్డులను అందజేశారు ఓల్డ్ బోయిన్‌పల్లి నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు యాదగిరి, నారాయణ, సుదర్శన్, రాజు, రమేశ్, మల్లేశ్, సుభాష్, రాజేశ్, సాయిబాబా, శివ, సంజీవ, చిరంజీవి, కిషన్, రఘునందన్, ఆనంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీవీ ఎన్‌క్లేవ్ లో..

పీవీ ఎన్‌క్లేవ్, వెస్లీ టీచర్స్ కాలనీలో కాలనీవాసులు అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి కార్పొరేటర్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, తాగునీటి సమస్యలతో పాటు డ్రేబ్రిస్ పేరుకుపోయిందని దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి సకాలంలో పరిష్కరిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్యామ్, ఆదిత్య రెడ్డి, హరీశ్, రవితేజ పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ :సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవం నేపథ్యంలో చైర్మన్ ఎం. లక్ష్మణ్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథిగా హిటాచీ డిజిటల్‌లో సైక్లిస్ట్, గ్లోబల్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ లీడర్ నేహా విచ్చేశబూరు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. చంద్రశేఖర్ యాదవ్, ప్రొ. గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ పి. సంతోష్ కుమార్ పాత్ర పాల్గొన్నారు. ఆటల విజేతలు, మహిళా బోధన, బోధనేతర , హౌస్ కీపింగ్ సిబ్బందికి బహుమతులు పంపిణీ చేశారు.

జగద్గిరిగుట్ట : కన్యకా పరమేశ్వరి ఆలయంలో బీఆర్ఎస్ నాయకురాలు శశికళ జగన్ నేతృత్వంలో మహిళా దినోత్సవం నేపథ్యంలో ప్రతిభావంతులను సన్మానించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీదేవి, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఉషారాణి, టీజీ బ్యాంక్ ప్రతినిధులు రఘునందన్ రావు, హరి ప్రియ, కిశోర్ కుమార్, డివిజన్ మహిళా నాయకులు వరమ్మ ,సువర్ణ, కొలుకుల జ్యోతి, శాంతి హైమావతి పద్మ, మంజుల ,శోభారాణి, ఝాన్సీ సుజాత, లక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారానికి కృషి

శేరిలింగంపల్లి : టీఎన్జీవోస్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు సమస్యలను పరిష్కరిస్తానని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన కాలనీలో పర్యటించారు. యూజీడీ పైపులైన్ నిర్మాణం, తాగునీటి వసతి, వీధిదీపాలు, పారిశుధ్య పనులు, సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నరేందర్ రెడ్డి, డీఈ విశాలాక్షి, జీహెచ్ఎంసీ అధికారులు,డివిజన్ నాయకులు, టీఎన్జీవోస్ కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ భద్రతపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లెర్నింగ్‌లైట్స్ సంస్థ ప్రతినిధులు

శేరిలింగంపల్లి : లెర్నింగ్ లైట్స్ ఇనిషియేటివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మూడు ప్రభుత్వ పాఠశాలల్లో సైబర్ భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగం, సైబర్ బుల్లీయింగ్, ఫిషింగ్, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ భద్రతను కాపాడుకునే మార్గదర్శక అంశాలు, బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరసత్వంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 1,300 మంది విద్యార్థులకు అవగాహన కల్పించామని ప్రతినిధులు సుభాని మోహన్ తెలిపారు. డిజిటల్ యుగంలో విద్యార్థులకు సైబర్ భద్రత, డిజిటల్ సాక్షరత అవసరమని, యువత ఆన్‌లైన్ ప్రపంచాన్ని సురక్షితంగా అన్వేషించేందుకు, మోసపోకుండా సురక్షిత మార్గాలను అవగాహన చేసుకోవడానికి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. సైబర్ అవగాహన సెషన్లు విద్యార్థుల భవిష్యత్ సురక్షితంగా తీర్చిదిద్దేందుకు సహాయపడతాయని తెలిపారు.

గాయత్రి నగర్ సంక్షేమ సంఘం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన గాయత్రినగర్ సంక్షేమ సంఘం సభ్యులు

అల్లాపూర్ : గాయత్రి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వి.కృష్ణారావు పానల్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ప్రతి రెండేండ్లకు ఓ సారి జరిగే ఎన్నికల్లో భాగంగా సోమవారం నామినేషన్లు ప్రారంభమయ్యాయి. కృష్ణారావు పానెల్ మినహా ఇంకెవరూ నామినేషన్లు వేయలేదు. దీంతో అధ్యక్షుడిగా వి.కృష్ణారావు, ఉపాధ్యక్షునిగా కె.ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ,సంయుక్త కార్యదర్శిగా విష్ణువర్ధన్, కోశాధికారిగా బి.శ్రీలత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సూరిబాబు మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొండాపూర్ : జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చందానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూనగర్ వాసి మేకల నవీన్ (32), కొంతకాలం క్రితం ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి ఇంట్లోనే ఉంటూ మద్యానికి బానిస అయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు, జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నవీన్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగల అరెస్ట్

మియాపూర్ : ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న ఓ యువకుడు, ఇద్దరు మైనర్లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మియాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. డీఐ రమేశ్‌నాయుడు వివరాల ప్రకారం.. నిజాంపేట్ బండారి లే అవుట్ కాలనీకి చెందిన హిమాన్స్, ఇద్దరు మైనర్లను స్నేహితులుగా చేసుకొని ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడేవారు. మియాపూర్ పీఎస్ పరిధిలోని మాధవ్‌నగర్ కాలనీ నర్సింహాగౌడ్ ఇంటిఎదుట రాయల్ ఎన్ఫీల్డ్ ద్విచక్ర వాహనం పార్కు చేశాడు. కనిపించక పోయేసరికి, గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని గుర్తించారు. మియాపూర్ పీఎస్‌లో నర్సింహాగౌడ్ 7న ఫిర్యాదు చేశాడు. ఏసీపీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు సీఐ క్రాంతి కుమార్ పర్యవేక్షణలో డీఐ రమేశ్ నాయుడు బృందం దర్యాప్తు చేశారు. హిమాన్సును అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. ఇద్దరు మైనర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆర్‌సీ పురం, బాచుపల్లి, కూకట్‌పల్లి పీఎస్‌లో కేసులున్నాయని తెలిపారు. గతంలో జువైనల్ హోమ్‌లో కౌన్సెలింగ్ తీసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసి, వారి వద్ద ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ప్లాస్టిక్‌గోదాంలో అగ్నిప్రమాదం

జీడిమెట్ల : జీడిమెట్ల పీఎస్ రిధిలోని సుభాష్ నగర్‌లోని ప్లాస్టిక్‌గోదాంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించింది. జీడిమెట్ల అగ్నిమాపక కేంద్ర అధికారి శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖాళీ స్థలంలో ఉన్న ప్లాస్టిక్ ట్రే గోదాంలో మంగళవారం ప్రమాదవశాత్తు మంటలు, పొగలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్‌ఇంజన్ సాయంతో మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. ప్రాణనష్టం జరగలేదు. జీడిమెట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గంచెరువు కళ కళ లాడాలి

కొండాపూర్, మార్చి 11 : ఐటీ జోన్లో కీలకమైన దుర్గంచెరువును కళకళలాడేలా తీర్చిదిద్దాలని బల్దియా కమిషనర్ ఇలంబర్తి స్పష్టం చేశారు. చెరువులో మురుగు నీరు చేరకుండా వాననీరు వచ్చేలా వ్యవస్థను అభివృద్ధి పరచాలని అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని దుర్గంచెరువును జడ్సీ ఉపేందర్ రెడ్డి, జలమండలి, ఎస్ఎన్డీపీ విభాగాల అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. మురుగునీటి డైవర్షన్ నిర్మాణ పనులపై అధికారులతో చర్చించారు.

ఎస్ఎన్‌డీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న స్ట్రామ్ వాటర్ లైన్ పురోగతిని పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. మురుగనీటిని దారి మళ్లించేలా పటిష్టమైన డ్రైనేజీల నిర్మాణానికి సమర్థవంతమైన ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. దుర్గం చెరువు లో పరిశుభ్రమైన జలాలు నింపి ఆహ్లాదకరమైన పరిసరాలను నగర ప్రజానీకానికి అందించేలా కార్యాచరణతో ముందుకు సాగాలని కమిషనర్ తెలిపారు. పురోగతిని పర్యవేక్షించాలని జోనల్ కమిషనర్, సంబంధిత విభాగాల అధికారులను బల్దియా కమిషనర్ ఇలంబర్తి ఆదేశించారు.

డ్రైనేజీ, వరద నీటి కాలువ వివరాలను పరిశీలిస్తున్న కమిషనర్ ఇల్లంబర్తి

కార్యక్రమంలో డీసీ ముకుంద రెడ్డి, ఎస్ఈ శంకర్‌నాయక్, ఈఈ దుర్గాప్రసాద్, డీఈ ఆనంద్, ఎలక్ట్రికల్ ఈఈ మల్లికార్జున్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ, హెచ్ఎండబ్ల్యూఎస్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్. పద్మజ పాల్గొన్నారు.

రాయితీని వినియోగించుకోండి

మియాపూర్ : అనుమతులు లేకుండా వేసిన లే అవుట్లలో ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ రాయితీ పథకాన్ని వినియోగించుకోవాలని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు . ఈనెల 31లోగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారికి 25% రాయితీని ప్రభుత్వం కల్పించిందన్నారు. చందానగర్ సర్కిల్ కార్యాలయంలో పథకంపై పట్టణ ప్రణాళిక విభాగం , నాక్ ఇంజినీర్లు ,కంప్యూటర్ ఆపరేటర్లతో డీసీ మంగళవారం సమావేశం నిర్వహించారు. 1504 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా , వెయ్యి మంది వరకు స్పందించారని , మిగిలిన వారు ముందుకు వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. 2020 లో ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు ఫీజును 31 లోగా చెల్లిస్తే ఫీజులో 25% రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు, డెస్క్‌ను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని డీసీ తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనలు పూర్తిచేసే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీసీ నాగిరెడ్డి, టీపీఎస్‌లు, నాక్ ఇంజినీర్లు కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీ మోహన్ రెడ్డి

పార్క్ స్థలం పరిశీలన

కొండాపూర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీ, అర్జున్ రెడ్డి కాలనీల పార్కు స్థలాన్ని డీసీ మోహన్ రెడ్డి టౌన్ ప్లానింగ్, అధికారులతో కలిసి పరిశీలించారు. పార్కు స్థలం కబ్జాకు గురవుతుందంటూ కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం పరిశీలించి, పార్కు స్థలాన్ని కాపాడి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్థలం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలంటూ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు కార్యక్రమంలో అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

పికప్ యంత్రం సేవలు భేష్

కొండాపూర్ : మాదాపూర్ లోని ఇనార్బిట్ మాల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)తో సైబరాబాద్ పరిధిలో ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ ఎలక్ట్రిక్ లిట్టర్ పికప్ యంత్రాల పనితీరు అద్భుతంగా ఉందని ఇనార్బిట్ యాజమాన్యం తెలిపింది. మాల్ నుంచి 4 కి.మీ. వ్యాసార్థంతో పనిచేస్తున్న 6 యంత్రాలు సమర్థవంతంగా చెత్తను సేకరిస్తున్నట్లు తెలిపింది.

తై బజార్ వేలంపాట

కుత్బుల్లాపూర్ : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో తై బజార్ వేలంపాటను మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ కృష్ణారెడ్డి సమక్షంలో నిర్వహించారు. 2025– 26 ఆర్థిక సంవత్సరానికి గాను పాట నిర్వహించగా నలుగురు హాజరయ్యారు. ఏ గోపాల్ రెడ్డి రూ.15 లక్షల పదివేలకు పాడి తై బజార్ వేలంను దక్కించుకున్నారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 11 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో మంగళవారం కూరగాయల ధరలు (కేజీ – రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 13, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 21, కాకర 45, బీర 55, క్యాబేజీ 10, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యారెట్ 19, కాలీఫ్లవర్ 18, దొండ 45, చిక్కుడు 50, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 31, ఆలుగడ్డ 21, కీరా 18, దోస 25, సోరకాయ 15, పొట్ల (1) 18, కంద 65, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 30, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 55, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడి 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 6 నుంచి 8, పచ్చి బఠానీ 50, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 140, కరివేపాకు 100గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.